క్లుప్తంగా

ఆలూరు సీఐగా వెంకటచలపతి



ఆలూరు రూరల్: ఆలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా వెంకట చలపతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస నాయక్‌ను కర్నూలు వీఆర్‌కు పంపించారు. అన్నమయ్య జిల్లా ఎస్‌బీ సీఐగా పనిచేస్తున్న వెంకట చలపతిని ఇక్కడికి బదిలీ చేయడంతో విధుల్లో చేరారు. ఆయన మాట్లాడుతూ..అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

18న పత్తికొండలో జాబ్‌మేళా

పత్తికొండ(తుగ్గలి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మాధురి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ చదివి, 21- 45 ఏళ్లలోపు వయస్సున్న యువతీ, యువకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎల్ ఆనంద్‌రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో శ్రీరామ్ చిట్, లైఫ్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు పాల్గొంటాయని వెల్లడించారు. ఆసక్తిగల నిరుద్యోగులు విద్యార్హత పత్రాల జిరాక్సులు, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ 9014588552 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణ ప్రాంతాల్లోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి ఈ నెల 18వ తేదీన చేపట్టే ఆందోళన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లు లేని పేదలకు స్థలాలు ఇచ్చి, నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 18వ తేదీన సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సచివాలయ వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. పట్టణ కార్యదర్శి గిరి, సహాయ కార్యదర్శి రాజు, చిన్న మాదులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు సుమంత్, రాజేష్ పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ

దేవనకొండ: మండలంలోని కరిడికొండ గ్రామంలో చెత్తబుట్టలను గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ జి.టైలర్ హనుమంతు, పంచాయతీ కార్యదర్శి ప్రజలకు అందించారు. వారు మాట్లాడుతూ ప్రజలు ఇళ్లల్లోని చెత్తాచెదారాన్ని డస్ట్‌బిన్‌లలో వేసి ఇంటి వద్దకు వచ్చే పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని చెప్పారు.

ఎల్లార్తిలో ప్రత్యేక ఫాతెహాలు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు దర్గా పరిసరాల్లో రాత్రి నిద్రించారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిబిగితాతా దర్గాల్లో, షిర్డిసాయిబాబా ఆలయాల్లో పూజలు చేశారు.

స్క్రీనింగ్‌తో క్యాన్సర్ గుర్తింపు



గోవర్ధనగిరిలో మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వెల్దుర్తి(కృష్ణగిరి): క్యాన్సర్‌పై విజయం కేవలం స్క్రీనింగ్‌తోనే సాధ్యమవుతుందని వైద్యాధికారులు నవీన్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోవర్ధనగిరి, బింగిదొడ్డి, మాదార్‌పురం, లక్ష్మీనగరం, శ్రీరంగాపురం, కృష్ణగిరి మండలంలోని తొగర్చేడు, టి. గోకులపాడు గ్రామాల్లో గురువారం వైద్య సిబ్బంది క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి పరీక్షలు చేస్తున్నామని, ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ముందస్తు పరీక్ష చేయడం వల్ల క్యాన్సర్‌ను గుర్తించి మెరుగైన వైద్యం అందజేయవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ భాగ్యలక్ష్మి, ఎంపీహెచ్ఎస్ నాగలక్ష్మి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

హొళగుంద: ఈ నెల 18వ తేదీన కర్నూలులో జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సుకు మాదిగలంతా తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు హెబ్బటం ఫక్కీరప్ప, మండల ఇన్‌చార్జ్ భీమ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించిన అంశంతో పాటు ఇతర విషయాలపై సంఘం వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని చర్చిస్తారని చెప్పారు. హాజరై విజయవంతం చేయాలని కోరారు.లింగంపల్లి శేషగిరి, ఎంపీటీసీలు మల్లికార్జున, కెంచప్ప, గోవిందు, రాముడు, శివలింగ పాల్గొన్నారు.

అరకొరగా 'సమాచారం'!

- సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించని అధికారులు
- అమల్లోకి వచ్చి 19 ఏళ్లయినా డెబ్బై శాతం మందికి అపరిచితమే
- ఇప్పటి వరకు ప్రతి మండలానికి అందిన దరఖాస్తులు 200లోపే
- ఏడాదిగా స.హ చట్టం బోర్డులేని ఆలూరు ఎంపీడీఓ కార్యాలయం



ఏడాదిగా సమాచార హక్కు చట్టాన్ని తెలిపే బోర్డు లేని ఆలూరు ఎంపీడీఓ కార్యాలయం



ఆలూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డు

ఆలూరు రూరల్: సమాచార చట్టం.. సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం. ప్రభుత్వ పథకాల అమలకు సంబంధించిన కార్యక్రమాలు, అభివృద్ధి పనుల కోసం చేసిన ఖర్చు, వివరాలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు ప్రభుత్వ ఈ చట్టానికి రూపకల్పన చేసింది. ప్రభుత్వ కార్యక్రమాలన్నింటినీ సామాన్యుడు సైతం తెలుసుకునేందుకు ఈ చట్టాన్ని తెచ్చింది. ప్రజలకు చైతన్యం కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతో చట్టం నిర్వీర్యంగా మారుతోంది.

చట్టం ఉందా?

2005 మే 11న సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చింది. నియోజకవర్గంలో ఈ చట్టంపై 70శాతం మందికి కూడా అవగాహన లేదు. చాలా మందికి అసలు ఈ చట్టం గురించి తెలియదు. దీనిపై అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. చట్టం అమల్లోకి వచ్చి 19 ఏళ్లయినా ప్రజల్లోకి పూర్తిగా వెళ్లలేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులకే పరిమితమైంది. ఇన్నేళ్లలో ఏ మండలంలో చూసినా దీన్ని వినియోగించుకున్న వారి సంఖ్య 200 మంది కూడా లేరంటే అతిశయోక్తి కాదు. వివిధ శాఖలకు సంబంధించి సమాచార ఈ చట్టం ద్వారా కోరిన వారు పదుల సంఖ్యలో మాత్రమే ఉన్నారు. కార్యాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన బోర్డుల్లో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి పేర్లు సైతం సక్రమంగా నమోదు చేయడం లేదు. సంక్షేమ పథకాల పనితీరు గురించి తెలుసుకోవాలనే వారికి ఏ అధికారిని సంప్రదించాలో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారాన్ని కోరే దరఖాస్తు ఫారాలు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం.

పనిభారం అవుతుందనా?

ఈ చట్టంపై అవగాహన కల్పిస్తే పని భారం పెరుగుతుందని భావించి అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఆయా మండలాల్లో ఎక్కువ మంది పథకాల వివరాల కోసం దరఖాస్తు చేసుకుంటే, నిర్ణీత కాలంలో అధికారులు పూర్తి వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. దీనివల్ల తమకే ఎక్కువ ఇబ్బందులు వస్తాయని వారు దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకోరావడం లేదన్న భావన వ్యక్తం అవుతోంది. పైగా అధికారులు చేసిన తప్పొప్పులు కూడా బయటపడతాయని, దరఖాస్తుదారులకు జవాబుదారీగా వ్యవహరించాల్సి ఉంటుందన్న భయంతో ఉద్దేశ్యపూర్వకంగానే ఈ చట్టాన్ని పక్కన పెట్టినట్లు ఆరోపణలున్నాయి.

అరకొర సమాచారంతో సరి..

ఒకరో ఇద్దరో అడిగిన సమాచారానికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వకుండా మొక్కుబడిగా, అరకొర సమాచారం ఇచ్చి సరిపెడుతున్నారు. మరికొన్ని దరఖాస్తులకు అసలు స్పందించకుండానే దరఖాస్తు చేసుకున్న వారికి సర్దిచెబుతున్నట్లు తెలుస్తోంది. ఇలా సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు కావడం లేదు. ఇక దీని అమలును పర్యవేక్షించే వారెవరో కూడా తెలియని పరిస్థితి. ఫలితంగా ప్రజలకు ఈ చట్టం వల్ల ఉపయోగం లేకుండా పోయింది.

ఏడాదిగా స.హ. బోర్డులేదేమీ?..

ఆలూరులో గతేడాది ఎంపీడీఓ కార్యాల భవనాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ శాఖల్లో ఇదో కీలకమైన శాఖ. మండల అభివృద్ధి, నిధుల కేటాయింపు వంటి తదితర కార్యకలాపాలు ఇక్కడ నుంచే జరుగుతాయి. అయితే కార్యాలయం ప్రారంభించి ఏడాది కావస్తున్నా సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేయలేదు. పౌరసమాచార అధికారి ఎవరు..సంక్షేమ పథకాల అమలు,అభివృద్ధి గురించి ఎవరి సంప్రదించాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అవగాహన కల్పించాలి



సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రజలకు ఈ చట్టంపై అవగాహన ఉంటే ప్రభుత్వ పథకాల్లో అవకతవకలు జరగడానికి అవకాశం ఉండదు. కొన్ని శాఖలలో అడిగిన సమాచారం సరిగా ఇవ్వడం లేదు. కార్యాలయాల్లో చట్టానికి సంబంధించి సమాచారం అందించే అధికారుల పేర్లను బోర్డుల్లో నమోదు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– షాకీర్, సీపీఎం,మండల కార్యదర్శి,ఆలూరు

18న సచివాలయాల ఎదుట నిరసన

పత్తికొండ(తుగ్గలి) : అధికారంలోకి వస్తే పేదలకు ఇళ్ల స్థలాలు, రుణాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వ హామీ నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని చదువులరామయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో 2సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన సచివాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ నాయకులు నబిరసూల్, రాజాసాహెబ్, సుల్తాన్, నాగరాజు, కారుమంచి, సురేంద్ర కుమార్, ఉమాపతి, కారన్న, తిమ్మయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

స్థలం మంజూరు చేయండి

హొళగుంద: మండల కేంద్రంలో కనకదాసు ఆశ్రమం, కమ్యూనిటీ హాల్ భవనం ఏర్పాటుకు స్థలాన్ని మంజూరు చేయాలని మాదాసి, మాదారి కురువ సంఘం మండల నాయకులు గురువారం ఆదోనిలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి కోరారు. సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి పెద్యాట మల్లయ్య, మండలాధ్యక్షుడు పంపాపతి, కనకశ్రీ యూత్ నాయకుడు ఎస్కే గిరి, నాయకులు శివబసవ, పత్తికొండ నాయకులు శంకర్,నాగేంద్ర, నరసారెడ్డి తదితరులు కలిసి వినతి పత్రం సమర్పించారు. హొళగుందలోని 373 సర్వే నంబరులో కురువ సంఘం అనుభవంలో కలిగి ఉన్న 0.30 సెంట్ల స్థలాన్ని కేటాయించి అన్ని హక్కులు కల్పించాలని సబ్ కలెక్టర్‌ను కోరినట్లు వారు తెలిపారు. ఇందుకు సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు

మంచి పుస్తకంతో జీవితంలో మార్పు



ఆలూరు గ్రంథాలయంలో నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు

పత్తికొండ(తుగ్గలి):మంచి పుస్తకాలు మనిషి జీవితంలో గొప్ప మార్పును తీసుకువస్తాయని మద్రో పాఠశాల హెచ్ఎం కాశీం అన్నారు. పట్టణంలో శాఖా గ్రంథాలయంలో గురువారం బాలల దినోత్స వం, జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. హెచ్ఎం మాట్లాడుతూ నిత్యం పుస్తక పఠనంతో జ్ఞానం లభిస్తుందన్నారు. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి పుస్తకాలు ఒక మార్గమన్నారు. తొలుత దేశ తొలి ప్రధాని నెహ్రూ, గ్రంథాలయ పితామహుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయుడు జిలాన్ పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ భావించి అందుకు పునాదులు వేశారని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సాయిప్రసాద్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం 57వ గ్రంథాయల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారంనెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి కవితాబాయి పాల్గొన్నారు.

ఆస్పరి: విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోయం చేసుకోవాలని కేడీసీసీ జిల్లా మాజీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర అన్నారు. గురువారం ఆస్పరిలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, మాజీ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ని వాళులర్పించారు. లైబ్రేరియన్ విశ్వనాథరెడ్డి ఉన్నారు.

ఆలూరు రూరల్: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని మొలగవల్లి స్టేట్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రయ్య అన్నారు. మండలంలోని మొలగవల్లి గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేద పిల్లలకు స్టేట్ బ్యాంక్ తరుపున ఆర్థిక సహాయం అందించి ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. గ్రంథాలయ అధికారి భాస్కర్, పంచాయతీ సూపర్‌వైజర్ రామాంజనేయులు, సీపీఐ నాయకులు భూపేష్ పాల్గొన్నారు.

ఆలూరులో..

ఆలూరు గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభించినట్లు గ్రంథాలయ ఇన్‌చార్జ్ అధికారి భాస్కర్ తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు. అంతకు ముందు నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పించారు. రిటైర్డ్ హెచ్ఎం ఈరన్న,రిటైర్డ్ ఆర్మీ అధికారి నర్సిరెడ్డి, రామ్మూర్తి హాజరయ్యారు.



పత్తికొండ బాలికల జెడ్పీహెచ్ఎస్‌లో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్ఎం, టీచర్లు

నేటి బాలలే రేపటి పౌరులు

మద్దికెర : నేటి బాలలే రేపటి పౌరులని.. దేశాభివృద్ధి పౌరుల మీద ఆధారపడి ఉందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సవిత, శ్రీవిద్యాసాయి కరస్పాండెంట్ వెంకట్‌మాధవ్, ప్రిన్సిపాల్ సునీత అన్నారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్, శ్రీవిద్యాసాయి విద్యాసంస్థల్లో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు.

పత్తికొండ(తుగ్గలి) : నేటి బాలలే నవ భారత నిర్మాతలని, దేశ భవిష్యత్ వారిపైనే ఆధారపడి ఉందని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం భ్రమరాంబ అన్నారు. చిల్డ్రన్స్ డే వేడుకలను గురువారం పత్తికొండ, తుగ్గలి మండలాల్లోని పాఠశాలల్లోనెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పించారు.

ఆస్పరి: మండలంలోని గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా జరపుకున్నారు. ఆయా పాఠశాలల్లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పరిలో సర్పంచ్ మూలింటి రాధమ్మ మాట్లాడారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్న ప్రశాంతికి రూ. 5వేలు, రెండవ బహుమతి.. మూలింటి రవికి రూ. 3వేలు, మూడవ బహుమతి.. లక్ష్మికి రూ. 2వేలు, నాల్గవ బహుమతి గెలుచుకున్న గీతాంజలికి వెయ్యి అందజేశారు.

సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలి



పత్తికొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



ఆలూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం పార్టీ నాయకులు

పత్తికొండ(తుగ్గలి) : ప్రభుత్వాలు..ప్రజలపై భారం మోపడం ఆపకపోతే, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోతే ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, మండల కమిటీ సభ్యుడు చక్రాల్ల వెంకటేశ్వరరెడ్డి హెచ్చరించారు. హామీల అమలు, అధిక ధరలు, విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ప్రజాపోరు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతుందే తప్ప.. సంక్షేమం, ప్రజా శ్రేయస్కర కార్యక్రమాలు కనిపించడం లేదన్నారు. అనంతరం రీసర్వే డీటీ బాలరాజునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. గోపాల్, తిమ్మప్ప, ఉరుకుందు, హుసేన్, రంజిత్, వివేక్, మధు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు నగేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ట్రూ అప్ చార్జీలను, స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని, ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేస్తామని, ఉచిత ఇసుక అందిస్తామన్న ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీ ల పేరుతో రూ. 17 వేల కోట్లు బారం ప్రజలపైన వేస్తున్నారని విమర్శించారు. నాయకులు రాజు, చిన్న యేసు, రాముడు, సత్యం, పాపారాయుడు, నాగన్న, హరి, సునీల్, మద్దిలేటి పాల్గొన్నారు.

ఆస్పరి: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. స్థానిక పార్టీ కార్యాలయం నాయకులు, కార్యకర్తలు, రైతులు ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు హనుమంతు, బాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. అనంతరం వినతి పత్రాన్ని ఎంపీడీఓ గీతావాణికి ఇచ్చారు. రంగస్వామి, మాణిక్యప్ప, నరసింహులు, రామాంజినేయులు, రవి, పెద్దవీరభద్రి, ఈరన్న, మల్లేష్, వీరేష్ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలును విస్మరించిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ అన్నారు. ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలన్నారు. అధిక ధరలుతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. రైతు పెట్టుబడి భరోసా రూ.20 వేలు అందించాలన్నారు.వలసలు నివారించి ప్రజలకు ఉ పాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నారాయణ స్వామి, మండల కార్యదర్శి షాకీర్, ఈరన్న, మైనా, షేకన్ బీ,విఠల్,నాగరాజు, పరమేష్,వీరేష్ పాల్గొన్నారు.

వైన్‌షాపులో చోరీ

దేవనకొండ: మండల కేంద్రంలోని వైన్ షాపులో గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో చోరీ జరిగిందని షాపు యజమానులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. షాపులోనున్న సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించగా, ఇద్దరు ఆగంతకులు స్కూటీపై వచ్చి దొంగతనం చేసినట్లు రికార్డు అయ్యిందన్నారు. అయితే వారు ముఖాలకు మాస్కులు ఉన్నందున గుర్తించడానికి వీలు కాలేదని చెప్పారు. దుకాణంలోని రూ.9,500 నగదు అపహరణకు గురైనట్లు పేర్కొన్నారు.

క్రషర్ మోటార్ అపహరణ

హొళగుంద : మండలంలోని చిన్నహ్యాట గ్రామ సమీపంలో నాలుగు నెలలుగా మూతపడి ఉన్న క్వారీ వద్ద రూ.70 వేల విలువజేసే క్రషర్ మోటార్ చోరీ అయినట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు. సూపర్‌వైజర్ బోయ ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

108 ఉద్యోగుల సమ్మె నోటీసు



ఎంపీడీఓ గౌరీదేవికి వినతి పత్రం అందజేస్తున్న 108 సిబ్బంది

దేవనకొండ: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల 108 అంబులెన్స్ సిబ్బంది గురువారం ఎంపీడీఓ గౌరీదేవికి సమ్మె నోటీసు అందించారు. సిబ్బంది మాట్లాడుతూ ఏపీ 108 సర్వీస్ లోనికి ఏఈఎంఎస్ సంస్థ వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ ఉద్యోగులకు ఒక సంవత్సరం మాత్రమే ఇంక్రిమెంట్ ఇచ్చిందన్నారు. ప్రతి ఉద్యోగి జీతంపై 40 శాతం పెంపుదలను ఇంక్రిమెంట్‌గా అందించాలన్నారు. జూలై 2024 నెల జీతం నుంచి అమలు చేసి అరియర్స్‌తో కలిపి ప్రస్తుత నెల వేతనంలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

పత్తికొండ(తుగ్గలి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు గురువారం డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వర్ణలతకు సమ్మె నోటీసు అందజేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ అలీ మా ట్లాడుతూ ఉద్యోగులకు అర్జిత సెలవులు, గ్రా ట్యుటీ, పెండింగ్ వేతనాలు చెల్లించడం లేదన్నారు. 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించి, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పెండింగ్ బిల్లులు, వేతనాల స్లాబ్ విధానాన్ని అమలు చేయాలని, ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని అనేక దఫాలుగా ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందించినా పరిష్కారం కాకపోవడంతో సమ్మెకు వెళ్లాల్సి వచ్చిందన్నా రు.సంఘం సభ్యుడు శాంతరాజు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



తుగ్గలిలో మాట్లాడుతున్న జిల్లా అబ్జర్వర్ రత్నం

పత్తికొండ(తుగ్గలి) : గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు భాగస్వాములు కావాలని జిల్లా అబ్జర్వర్ రత్నం కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువా రం జీపీడీపీ 2024-25 వార్షిక ప్రణాళికకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధి పథంలో నడి పించడానికి కృషి చేయాలన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలనే అంశాలపై అధికారులు శిక్షణ ఇచ్చారు. కా ర్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వర్ణలత, ఈవోపీఆర్డీ నరసింహులు పాల్గొన్నారు.

తుగ్గలిలో..

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక నిధుల వినియోగంపై ఈవోపీఆర్డీ శ్రీహరి శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా అబ్జర్వర్ రత్నం తనిఖీ చేశారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2025-26 సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శుక్రవారం అధికారులకు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ సుహాసినమ్మ గురువారం తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీతోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులతోపాటు గ్రామస్థాయిలో ఉండే అన్ని శాఖల అధికారులందరూ హాజరు కావాలని ఆమె కోరారు.

మద్దికెర : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రతి ఒక్కరూ కీలకమని ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీడీఓ కొండయ్య అన్నారు. గురువారం పంచాయతీలు అభివృద్ధికి 2025-26 సంవత్సరానికి గ్రామ పంచాయతీ ప్రణాళికలు రూపొందించారు. సర్పంచులు సుహాసిని, అంజనేయులు, ఎంపీటీలు వేణమ్మ, అంజనేయులు, ఈఓ శివకుమార్, సుధాకర్, పరమేష్, హరి పాల్గొన్నారు.

కృష్ణగిరి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి మండల స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2025-26 సంవత్సరంలో గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనులను గుర్తించేందుకు ప్రతి అధికారి గ్రామాల్లో పర్యటించాలన్నారు. ప్రజల సహకారంతో ప్రణాళికలు తయారు చేయాలన్నారు. వైద్యాధికారి ప్రదీప్, సూపరింటెండెంట్ రామస్వామి, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ చిన్న లచ్చప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీలు పాల్గొన్నారు.

హాలహర్వి: గ్రామాభివృద్ధి ప్రణాళికలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు, వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏపీఓ చక్రవర్తి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉపాధి పనులను ఉపయోగించుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ రామాంజనేయులు, డాక్టర్ మన్సూర్ వలీ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

హొళగుంద: గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికను రూపొందించుకోవాలని ఎంపీడీఓ విజయలలిత సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025-2026కు సంబంధించి ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పలు అంశాలపై ప్రజా ప్రతినిధులకు ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ, ఈఓపీఆర్డీ చక్రవర్తి పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర దీపోత్సవం

ఆలూరు: మండలంలోని కమ్మరచేడు గ్రామంలోని సాయిబాబా ఆలయంలో గురువారం కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సహస్త దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబాకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

ధర్నాను జయప్రదం చేయండి

ఆస్పరి: పేదలకు ఇళ్ల స్థలాలు, నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన సచివాలయాలు ఎదుట చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. కృష్ణమూర్తి, బ్రహ్మయ్య, రాజశేఖర్, హనుమంతు, రంగస్వామి పాల్గొన్నారు.

తీరిన రోడ్డు సమస్య

హొళగుంద: మండల కేంద్రంలోని విరక్త మఠం పరిసర వాసులు సీసీ రోడ్డు లేక ఇబ్బందులు పడేవారు. పంచాయతీ నిధులతో సర్పంచ్ చలువాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. గురువారం పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. రోడ్డు ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సహకార సేవలను సద్వినియోగం చేసుకోండి



జొన్నగిరిలో జెండా ఆవిష్కరిస్తున్న సహకార సీఈఓ గిడ్డయ్య

తుగ్గలి : సహకార బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు సీఈవో గిడ్డయ్య అన్నారు. గురువారం జొన్నగిరి సింగిల్ విండో కార్యాలయంలో సహకార వారోత్సవాలను ప్రారంభించి సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల ప్రోత్సాహంతో ప్రైవేటు బ్యాంకులతో సమానంగా సహకార బ్యాంకులు ముందుకు సాగుతున్నాయన్నారు. సహకార రంగం ఆవిర్భావం, విశిష్టత, సహకార సూత్రాలను వివరించారు. బ్యాంకింగ్ సేవలు, రుణాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నాగరాజు, సురేంద్ర, గిరి, రాజశేఖర్ పాల్గొన్నారు.